క్లుప్తంగా

పదోన్నతి లభించినా గ్రేడ్ -2గానే చందర్‌రావు విధులు

వరంగల్: 'దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమివ్వలేదన్న చందంగా తయారైంది' వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పాలన దుస్థితి. మార్కెట్‌లో గ్రేడ్ -2 కార్యదర్శిగా పనిచేస్తున్న చందర్‌రావుకు ప్రభుత్వం గ్రేడ్ -1 అధికారిగా పదోన్నతి కల్పించి నల్గొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి లభించిన వెంటనే సదరు ఉద్యోగులు వెళ్లి జాయిన్ అవుతారు. కానీ, ఏప్రిల్ 24వ తేదీన పదోన్నతి లభించినప్పటికీ ఇక్కడే గ్రేడ్ -2గా చందర్‌రావు విధులు నిర్వహించడం పట్ల పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. చందర్‌రావుతో పదోన్నతులు లభించిన వారందరు ఆయా మార్కెట్లలో జాయిన్ కావడం, చందర్‌రావు మాత్రం ఇక్కడే విధులు నిర్వర్తించడం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ ఉన్నతాధికారి రిలీవ్ చేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

బీఫార్మసీ సీబీసీఎస్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) 4, 5, 6, 7వ సెమిస్టర్ల సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని బిఫార్మసీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బిఫార్మసీ సీబీసీఎస్ ఆయా సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని బీఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు.. పలుమార్లు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. కాగా, మంగళవారం పలు బీఫార్మసీ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు సంబంధిత అదనపు పరీక్షల నియంత్రణాధికారిని కలవడానికి పరీక్షల విభాగం లోపలికి వెళ్తుండగా వారిని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని విన్నవించేందుకు వచ్చామని చెబుతుండగా బయటకు వెళ్లాలని తమ పట్ల మల్లారెడ్డి దురుసుగా ప్రవర్తించారని ఓ విద్యార్థి వాపోయాడు.

నేటినుంచి కరాటే శిక్షణ శిబిరం

వరంగల్ స్పోర్ట్స్: బీఎంఆర్ కరాటే, కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు కరాటే, కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమీ ఫౌండర్ మాస్టర్ బండారి సంతోష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కరాటే కటాస్, సెల్ఫ్ డిఫెన్స్, వెపన్ కటాస్, పంచెస్, టెక్నిక్స్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 90005 86435, 91006 58538 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రజక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కుమారస్వామి



కాజీపేట అర్బన్: రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌కు చెందిన కంచర్ల కుమారస్వామిని నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడిరాజు నరేష్, పైడ్ల ఆశయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తన నియామకానికి కృషి చేసిన వారికి కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



కాశిబుగ్గ: వరంగల్ 35వ డివిజన్ పుప్పాలగుట్టలో బుధవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్‌బాబు, దుబ్బ శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, అనుమండ్ల నగేష్, కర్ర సత్యం, చారి, స్వాతి ఉన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అశోకా కన్వెన్షన్ హాల్‌లో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల డిజైనర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన ఫ్యాషన్ ప్రియులు, మగువలను ఆకట్టుకుంటోంది. స్టాళ్లలో కొలువుదీరిన చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు.. భారతీయ సంప్రదాయం ప్రతిబింబించేలా ఉన్నాయంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండుగలు, వివాహాది శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి వీలుగా అధునాతన డిజైన్లలో రూపొందించిన చీరలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు మిస్టర్ టీవీ రావు తెలిపారు. దేశంలో పేరుగాంచిన మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌజులు, టాప్స్, వన్‌గ్రాం గోల్డ్ జువెల్లరీ లభిస్తాయని తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శన నేటి (బుధవారం) తో ముగుస్తుందని పేర్కొన్నారు. వివరాలకు 94411 83981లో సంప్రదించాలని కోరారు.

పచ్చదనంపై వేటు.. లక్ష్యానికి తూట్లు

- విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో నగరానికి తరలుతున్న కలప (ఫైల్)



రవాణాకు సిద్ధంగా ఉన్న కలప (ఫైల్)

కాజీపేట: వాల్టా చట్టం నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది అక్రమార్కులు విచ్చలవిడిగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వందల ఏళ్ల నాటి వృక్షాలను గొడ్డలిపెట్టుతో నరికి వేస్తూ ఆ కలపతో వ్యాపారం చేస్తూ ఇబ్బడిముబ్బడిగా అర్జిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ విలీన గ్రామాలతో పాటు ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, హసన్‌పర్తి, నర్మెట్ట మండలాల్లో ఈ వ్యాపారం మూడు చెట్లు ఆరు కాసులుగా సాగుతోంది.

భారీ వృక్షాలను నేలకూలుస్తూ..

ఓ వైపు ప్రభుత్వం హరితహారం పేరుతో రూ.వందల కోట్లు ఖర్చు చేస్తూ మొక్కలను పెంచుతుండగా, మరోవైపు వ్యాపారులు తమ ఇష్టారీతిగా చెట్లను నరికి వేయిస్తుండటం చర్చనీయంశంగా మారింది. అన్ని చోట్లు నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను సరఫరా చేస్తూ ఓ మహాయజ్ఞంగా మొక్కల పెంపకాన్ని సర్కారు కొనసాగిస్తోంది. అయితే, అనేక ఏళ్ల నాటి మహా వృక్షాలను వ్యాపారులు నేలకూలుస్తూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. చెట్లను పెంచిన యజమానులకు ఎంతోకొంత డబ్బు ముట్టచెబుతూ ఈ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రూ.వందలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన చెట్లను రూ.వేలల్లో అమ్ముకుంటూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు. చెట్లను నరికి రాత్రిపూట పోలీసులు, రెవెన్యూ అధికారులు రోడ్లపై ఉండని సమయంలో ట్రాక్టర్లలో నగరానికి సరఫరా చేస్తున్నారు. అర్ధరాత్రి తర్వాత వందల సంఖ్యలో ట్రాక్టర్లు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న దృశ్యాలు నిత్యకృత్యం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కేంద్రాలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో వేలాది మంది పిల్లలకు కట్టెలతోనే వంట చేసి పెడుతున్నారు.

జోరుగా కలప రవాణా

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దాదాపు 4వేల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వండించడానికి ఏడాదికి ఎన్ని చెట్లు నేలకూలుతున్నాయో అవగతం చేసుకోవచ్చు. ఎన్ఐటీ, కేయూ, కేఎంసీ, హోటళ్లకు నిత్యం గ్రామాల నుంచి కలప రవాణా జోరుగా సాగుతోంది. మరికొన్ని రోజులు ఇలాగే జరిగితే అటవీ సంపద కనుమరుగవుతుందని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు ఇరువైపులా పెరిగిన వృక్షాలను అక్రమార్కులు నరికి వేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రివేళ నగరం ప్రధాన కూడళ్లలో నిఘా అధికం చేయాలని, చెట్లను నరికి వేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

మొక్కలను విరివిగా నాటాలి



నానాటికి తగ్గిపోతున్న చెట్ల వల్లే పర్యావరణ సమతులత్యత దెబ్బతింటోంది. ప్రతీఒక్కరు ప్రతి సీజన్‌లో కనీసం ఒకటి, రెండు చొప్పున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మొక్కల పెంపకాన్ని చేపట్టినందునా అందరం సహకరించాలి. లేకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు.

– ఎండీ.అఫ్జల్‌పాషా, బోడగుట్ట

అధికారులు చర్య తీసుకోవాలి



విచ్చలవిడిగా సాగుతున్న చెట్ల నరికివేతను అధికారులే అడ్డుకోవాలి. అన్ని శాఖల అధికారులు ఈ విషయంలో సమన్వయంతో కలిసి పని చేయాలి. ప్రతి నిత్యం గ్రామాల నుంచి వందలాది ట్రాక్టర్ల కలప వివిధ అవసరాల నిమిత్తం నగరానికి వస్తోంది. గ్రామాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది.. చెట్ల నరికివేతను ఆపాలి. చెట్లను కూలుస్తున్న వారిపై వాల్టా చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఠాకూర్ గణేష్‌సింగ్, కాజీపేట

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు

హన్మకొండ: కార్మిక దినోత్సవం సందర్భంగా కేవలం రూ.వేయి వేతనం పెంచి మున్సిపల్ కార్మికులను సీఎం కేసీఆర్ వంచించారని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ, మున్సిపల్ కార్మికుల జేఏసీ నాయకుడు వేల్పుల ధర్మరాజు విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల కనీస వేతనం ఇవ్వాలని, వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, మున్సిపల్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గమంతా కార్మిక దినోత్సవాన్ని పండుగలాగా జరుపుకుంటే, రాష్ట్రంలోని 70 వేల మంది మున్సిపల్ కార్మికులకు కేవలం రూ.వేయి పెంచి వారిని సీఎం కేసీఆర్ అవమాన పరిచారని వాపోయారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి అన్ని కార్మిక సంఘాలు శ్రీకారం చుడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బరుపట్ల మహేష్, మున్నంగి రఘు, మూర్తి రాజు, వెంకటస్వామి, యాస బాబు, దామోదర్, సుఖ్ దేవ్, కోటి, కుమార్, దేవమ్మ పాల్గొన్నారు.

కేటీఆర్ బహిరంగ సభకు తరలిరావాలి



కాజీపేట రూరల్: మాట్లాడుతున్న రవీందర్‌రావు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, కార్పొరేటర్

కాజీపేట రూరల్: కాజీపేట సెయింట్ గాబ్రియెల్ పాఠశాల మైదానంలో ఈ నెల 5వ తేదీన జరగనున్న మంత్రి కె.తారకరామారావు బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. కాజీపేట 47వ డివిజన్ డీజిల్‌కాలనీ చౌరస్తాలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జరగనున్న కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేష్, దువ్వ కనకరాజు, మర్యాల కృష్ణ, సిరిల్‌లారెన్స్, బొట్టు రాజు, తండమల్ల వేణు, గోల్కొండ రాంబాబు, మైలారం శంకర్, నహీం జుబేర్, వేణు, శ్రీనివాస్, పోతుల సాంబయ్య, భద్రయ్య, నర్సింగరావు, నగేష్, శ్రీకాంత్, తోట నగేష్, మల్లారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఈనెల 5వ తేదీన కాజీపేటలోని సెయింట్ గాబ్రియెల్ పాఠశాల మైదానంలో జరగనున్న మంత్రి కేటీఆర్ భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, మంత్రి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పిలుపునిచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 7, 9, 10 డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశం బ్రాహ్మణవాడలోని కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, మాజీ కార్పొరేటర్ శేఖర్, నాయకులు రజనీకాంత్, తిప్పర్తి ఈశ్వర్, మహ్మద్ ఖలీల్, ఆనంద్, సారంగపాణి, జనార్దన్ పాల్గొన్నారు.

అసోసియేషన్ పేరుతో తప్పుడు ప్రచారాలు



నినాదాలు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాశిబుగ్గ: కొంతమంది తమ అసోసియేషన్ పేరుతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారికి ఆజంజాహి మిల్స్ మాడిఫైడ్ వలంటరీ రిటైర్డ్(ఎంవీఆర్ఎస్) 2002 అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఎంవీఆర్ఎస్ అధ్యక్షుడు ఇప్ప ఆదినారాయణ తెలిపారు. ఎవరైనా అసోసియేషన్ పేరును వాడుకుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. భగత్‌సింగ్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఎంతో కష్టపడి పోరాటం చేయగా.. 318మంది కార్మికులకు మాసిటీలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్లాట్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. దీన్ని జీర్ణించుకోలేని, పోరాటంలో పాల్గొనని కొంతమంది అసోసియేషన్‌ను చీల్చే ప్రయత్నం చేస్తు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎంవీఆర్ఎస్ కార్యదర్శి జన్ను ప్రభాకర్, సభ్యులు సాంబయ్య, నారాయణ, చంద్రమోహన్, రాజమౌళి తదితరులు ఉన్నారు.

విద్యుత్ కార్మికులకు అండగా సంఘం



మాట్లాడుతున్న జాన్సన్

హన్మకొండ: విద్యుత్ కార్మికులకు అండగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్మించిన టీఆర్‌వీకేఎస్ జెండా గద్దెపై సంఘం పతాకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు సంఘం నాయకత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కార్మికులు టీఆర్‌వీకేఎస్‌కు అండగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు అందుకున్న కేవీ.జాన్సన్‌ను సంఘం నాయకులు, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బండారి ప్రభాకర్, నాయకులు ఎండీ.అక్బర్, హరి, అక్రం, రాజనరేంద్ర, రాజేందర్, మధు, సారంగపాణి, మమత, సరిత, ఈశ్వరిదేవి పాల్గొన్నారు.

'సీడ్స్ అసోసియేషన్' అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాశిబుగ్గ: ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శివనగర్‌లోని అసోసియేషన్ భవనం (సాయి కన్వెన్షన్ హాల్)లో ఎమ్మెల్యేను అసోసియేషన్ సభ్యులు గజమాలతో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఏ సమస్య ఎదురైనా తనను సంప్రదించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడగంగానే అసోసియేషన్ భవన అభివృద్ధికి ఎమ్మెల్యే నరేందర్ రూ.40 లక్షల నిధులు కేటాయించారని తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

హన్మకొండ: కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండ బాలసముద్రంలో కార్మిక నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్మిక మాసోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 5న మంత్రి కేటీఆర్ పాల్గొననున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్మిక, ఉద్యోగ సంక్షేమ మాసోత్సవ కోఆర్డినేటర్ పుల్ల శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మామునూరు: కార్మిక కుటుంబాలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ సోల్తీ భూమాత సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో కార్మిక శాఖ, సీఎస్, సీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు సేవా దృక్పథంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో దొంతి కృష్ణారెడ్డి, డివిజన్ యూత్ అధ్యక్షుడు సోల్తీ నరేందర్‌గౌడ్, ప్రభాకర్, డాక్టర్ సాయిరామ్ పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో కంటి వైద్య శిబిరం

హన్మకొండ: హనుమకొండ నయింనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఈసం నారాయణ, యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం తెలిపారు. అంతకుముందు ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరిత ప్రధాన వక్తగా మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ పి.హరేందర్ రెడ్డి, లైఫ్ సైన్స్ డీన్ జి.విక్రమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎనుకంటి రజిని కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫైళ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

వరంగల్ అర్బన్ : సిటిజన్ చార్టర్‌ను పటిష్టంగా అమలు చేయాలని బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఆదేశించారు. మంగళవారం కాజీపేట సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ జోనాతో కలిసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో ఫైళ్లను పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖాళీ స్థలాలకు, ఇంటినంబర్ల కేటాయింపు, కొత్త అసెస్‌మెంట్లు, పేరు మార్పిడిలు, తదితర వినతులను సకాలంలో పూర్తి చేయాలని, వీటిని డిప్యూటీ కమిషనర్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఆర్ఓలు యూసుఫోద్దీన్, శ్రీనివాస్, సూపరింటెండెంట్ అనిల్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సాక్ష్యంగా ఉంటే సవాలక్ష తిప్పలు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏదైనా ప్రమాదం జరిగినా, దొంగతనం జరిగినా ఆ సంఘటనలకు సాక్షులుగా ఉంటే తమకు తిప్పలు తప్పడం లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. యార్డుల్లో బస్తాలు పోయినా, దొంగతనాలు జరిగిన సమయాల్లో అక్కడే అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులనే సాక్షులుగా పోలీసులకు చేసిన ఫిర్యాదుల్లో నమోదు చేస్తున్నారు. తర్వాత కోర్టుల్లో కేసు విచారణ సమయాల్లో సాక్షులుగా హాజరు కావడం వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్ ఏనుమాముల మార్కెట్ ఆవరణలోనే ఉండడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులను సాక్షులుగా పెట్టాల్సి వస్తే పర్మనెంట్ ఉద్యోగులను కాకుండా తమను పంపడం సరికాదని సెక్యూరిటీ గార్డ్స్ సంఘం నాయకుడు యాకయ్య అన్నారు. ఇలాంటి కేసుల విషయాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఆయన మార్కెట్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడికొండ: మడికొండ – అయోధ్యపురం రోడ్డులోని టీఎన్‌జీఓఎస్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు కార్పొరేటర్ మునిగాల సరోజనను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

మానసిక వికలాంగులకు ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న జెరోమ్

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్‌లోని జీవధార కేంద్రంలో ఫాదర్ జెరోమ్ 35వ గురుపట్టాభిషేక వార్షికోత్సవాన్ని పేదలు, అనాథలు, మానసిక వికలాంగుల మధ్య మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఉన్న 165 మంది మానసిక వికలాంగులకు ఆర్థిక చేయూతనందించారు. సంవత్సరానికి రూ.6 వేల చొప్పున నాలుగు నెలలకు ఒక్కసారి రూ.2 వేలు పంపిణీ చేయనున్నట్లు జెరోమ్ తెలిపారు. అలాగే, నిరుపేదలు, పేద విద్యార్థులకు ఎప్పుడూ సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు ఆశ్రమాల ప్రతినిధులు, సిస్టర్లు, మానసిక వికలాంగులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల సేవలు విలువైనవి



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న రాకేష్‌రెడ్డి

హన్మకొండ: సఫాయి కార్మికుల సేవలు ఎంతో విలువైనవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని హౌసింగ్ బోర్డులో బీజేపీ నాయకుడు సాయి యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సఫాయి కార్మికులు లేని నగరాన్ని ఊహించలేమన్నారు. అయితే, సఫాయి కార్మికులకు కనీస రక్షణ కవచాలు లేవని, వారి ప్రాణాలకు భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సఫాయి కార్మికులకు, స్వచ్ఛతకు ప్రధాని నరేంద్ర మోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి, చిట్యాల సమ్మయ్య, ముప్పిడి రెడ్డిసాయి, తిరుపతి రెడ్డి, రామ్‌గోపాల్ రావు, శ్రావణ్ యాదవ్, నల్లా రమేష్, శివరాం, దినేష్, సతీష్, లక్ష్మణ్, గణేష్, నాగరాజు, వినయ్, రోహిత్, వసంత్ పాల్గొన్నారు.

బాటసారులకు అన్నదానం

కాజీపేట: బాటసారులకు కాజీపేట చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కుశాల్ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎం.కుశాల్, నల్ల ఓంకార్, వినయ్, రణధీర్, రోహిత్, సాయి, వసంత్, దివేంద్రనాథ్ పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



సారంగపాణిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు అందుకున్న తెలు సారంగపాణిని కాజీపేట చౌరస్తాలోని కార్మికుల అడ్డాపై కార్మిక సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. భవన నిర్మాణ రంగం కార్మిక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాజు ఆధ్వర్యంలో కార్మికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలడుగుల శివకుమార్, జేరిపోతుల దేవేందర్, రఫీ, సతీష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



కల్వర్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌యాదవ్

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన కల్వర్టు నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సూచించారు. అధికారులతో కలిసి కాలనీలోని పలు కల్వర్టులను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏతం రామన్న, రాజుయాదవ్, కోటేశ్వర్, బోయిని కుమార్‌యాదవ్, బొద్యాలు, కిషన్, రమేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మడికొండ: పీఏసీఎస్ దర్గా సొసైటీ ఆధ్వర్యంలో 46వ డివిజన్ రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, కార్పొరేటర్ మునిగాల సరోజన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తక్కళ్లపల్లి రాంగోపాల్‌రావు, డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, దేవేందర్‌రావు, మారగోని రవి, కడారి కుమార్, రఘుపతిరావు, వెంకన్న, రాజు, కుమార్, వెంకటయ్య, రమేష్‌బాబు, సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దేశాయిపేట్ గ్రామం, వరంగల్ మండలం, వరంగల్ జిల్లా యందు గల ఓపెన్ ప్లాట్ నెంబర్ 47, సర్వే నెం. 37/B లో, విస్తీర్ణం: 266.66 చదరపు గజాలు గలది. ఇట్టి భూమిని నా క్లయింట్ అయిన **చిదురాల శ్రీనివాస్, తండ్రి: శేఖరయ్య,** వయస్సు: 60 సం॥లు, నివాసం: ఏటూరునాగారం, ములుగు జిల్లా గారు వారి కుమారుడైన చిదురాల సుమన్, తండ్రి: శ్రీనివాస్, వయస్సు: 36 నివాసం: జయశంకర్ కాలనీ, చింతల్, వరంగల్ జిల్లా గారికి డాక్యుమెంట్ నెంబర్: 20427/2022, తేది: 10-08-2022 రోజున గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసినారు. ప్రస్తుతము నా క్లయింట్ అట్టి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో నా క్లయింట్ కుమారుడు చిదురాల సుమన్ అట్టి భూమిని అమ్ముటకు ప్రయత్నము చేయుచున్నాడు. అట్టి భూమిని తెలియకుండ ఎవరు కొన్నను వారిపై చట్ట రీత్యా చర్య తీసుకొనబడును. అట్టి భూమిని నా క్లయింట్ అయిన చిదురాల శ్రీనివాస్ గారికి తెలియకుండా కొనకూడదు. ఒకవేళ ఎవరైన కొన్నయెడల అట్టివి చట్టరీత్యా చెల్లనేరవు.

షెడ్యూలు దాఖల ఆస్తి హద్దులు: ఓపెన్ ప్లాట్ నెంబర్ 47, సర్వే నెం. 37/B లో, **విస్తీర్ణం:** 266.66 చదరపు గజాలు గలది, దేశాయిపేట్ గ్రామం, వరంగల్ మండలం, వరంగల్ జిల్లా యందు గల దాని **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 48, **పడమర:** ప్లాట్ నెం. 46, **ఉత్తరం:** 30-0 వెడల్పు రోడ్, **దక్షిణం:** ప్లాట్ నెం. 33.

Sd- CH. AGA REDDY, B.Sc., LLB.
Advocate Notary
Opp: NPDCL Office, Nakkalagutta,
Dt 02-05-2023. Hanamkonda. Cell: 9490380382